తృటిలో తప్పిన ప్రమాదం

యాక్సిల్ విరిగిన ఆర్టీసీ బస్సు

సోంపేట: ఆర్టీసీ బస్సుకు బుధవారం త్రుటిలో ఘోర ప్రమాదం తప్పింది. మండలంలోని పలాసపురం వద్ద పలాస నుంచి ఇచ్ఛాపురం 50 మంది ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు యాక్సిల్ విరగడంతో టైరు ఊడి పొలంలోకి దూసుకెళ్లింది. డ్రైవరు చాకచక్యంగా వ్యవహరించి బస్సును అదుపు చేయడంతో రోడ్డు మధ్యన బస్సు ఒక పక్కకు ఒరిగిపోయింది. ఈ ఘటనతో బస్సులో ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. పెను ప్రమాదం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రయాణికులను మరో బస్సు ఎక్కించి, వారి గమ్యస్థానాలకు పంపించారు. ఈ ఘటనపై ఆర్టీసీ అధికారులు ఆరా తీశారు.

భావనపాడు భూ సర్వేలో లోపాలు

భావనపాడు పోర్టుకు భూములను హడావుడిగా సర్వే చేసి నోటిఫికేషన్ వెలువరించడంతో అనేక తప్పిదాలు చోటుచేసుకున్నాయి. దీనిపై రైతుల నుంచి ఫిర్యాదులు రావడంతో అధికారులు మరోసారి భూముల రీ సర్వే చేపడుతున్నారు. కుటుంబసభ్యుల మధ్య భూ పంపకాలు జరిగినా అవి రికార్డుల్లో సరిగ్గా లేవు. కొంతమందికి వాస్తవ భూమి కంటే తక్కువ భూమి ఉన్నట్లు రికార్డుల్లో చూపుతున్నాయి. భూ విస్తీర్ణంలో చోటుచేసుకున్న తప్పిదాలను సరిచేయాలని రైతులు విజ్ఞప్తి చేయడంతో జిల్లా ఉన్నతాధికారులు రికార్డులను పరిశీలన చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో రెవెన్యూ అధికారులు గ్రామాలను సందర్శించి రైతుల సమక్షంలో రికార్డులను వెరిఫై చేస్తున్నారు. మరోవైపు రికార్డులన్నీ సక్రమంగా ఉన్న రైతులకు పరిహారం చెల్లించేందుకు అవార్డులను (చెల్లింపు పత్రాలు) సిద్ధం చేస్తున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, నౌపడ

మూలపేటలో పరిహారం చెల్లించేందుకు రికార్డులు సిద్ధం చేస్తున్న అధికారులు (ఫైల్)

- వాస్తవ విస్తీర్ణానికి, రికార్డుల్లో ఉన్న భూములకు వ్యత్యాసం
- పలుచోట్ల వివాదాలు
- లోపాలను సరిదిద్దుతున్న రెవెన్యూ యంత్రాంగం
- పరిహారం చెల్లింపులకు రికార్డులను సిద్ధం చేస్తున్న అధికారులు

సంతబొమ్మాళి మండలం భావనపాడు, మూలపేట గ్రామాల మధ్య వద్ద పోర్టు నిర్మాణం కోసం 717.26 ఎకరాలను సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో రైతుల నుంచి 312.40 ఎకరాలను సేకరించేందుకు జిల్లా అధికారులు ఈ ఏడాది ఏప్రిల్ 12వ తేదీన ప్రిలిమినరీ నోటిఫికేషన్‌ను వెలువరించారు. గత నెలలో డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ఇచ్చారు. రైతుల అనుమతి లేకుండానే రెవెన్యూ ఫైళ్ల ఆధారంగా ఫీల్డ్ సర్వే చేసి నోటిఫికేషన్‌ను వెలువరించారు. వీటిలో తప్పిదాలు ఉన్నట్లు రైతులు పలు సమావేశాల్లో ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ప్రస్తుతం వాటిని సరిచేసేందుకు అధికారులు మరోసారి క్షేత్రస్థాయి పరిశీలన చేపడుతున్నారు. వారసత్వంగా సంక్రమించిన ఆస్తిని సమానంగా పంచినా రికార్డుల్లో వేర్వేరుగా ఉన్నట్లు రెవెన్యూ అధికారులు గుర్తించి లోపాలను సరిదిద్దుతున్నారు. మరోవైపు రికార్డులన్నీ సక్రమంగా ఉన్న రైతులకు పరిహారం చెల్లించేందుకు అవార్డులు (చెల్లింపు పత్రాలు) సిద్ధం చేస్తున్నారు. ఆస్తుల విషయంలో వివాదాలు తలెత్తకుండా పోలీసు బందోబస్తు మధ్య రికార్డులను సరిచేస్తున్నారు.

సాగులో ఉన్న ప్రభుత్వ భూములకు పరిహారంపై స్పష్టత కరువు

జిరాయతీ భూములకు పరిహారం చెల్లింపు అంశం ఇప్పటికే ఖరారైంది. ఈనెల మూడో తేదీన కలెక్టరేట్‌లో నిర్వహించిన డిస్ట్రిక్ట్ లెవల్ నెగోసియేషన్స్ కమిటీ సమావేశంలో ఎకరాకు రూ.25 లక్షలు చెల్లించేందుకు అంగీకారం కుదిరించింది. డి-పట్టా భూములకూ అదే ధర చెల్లిస్తామని అధికారులు ప్రకటించారు. తరతరాలుగా రైతుల సాగులో ఉన్న భూములకు పరిహారం చెల్లింపులపై అధికారులు స్పష్టత ఇవ్వలేదు. భూములను అధ్యయనం చేసి రైతులకు న్యాయం చేస్తామని అధికారులు చెప్తున్నారు. దీనిపై మరోసారి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని కలిసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

భూములకు ధర ప్రకటనతో అంతా అయిపోయినట్లేనా?

భూములకు ధర ప్రకటనతో అంతా అయిపోయినట్లుగా అధికారులు భావిస్తున్నట్లుగా కనిపిస్తోంది. నిర్వాసితులకు పరిహారం, పునరావాసం కింద ఏం చెల్లిస్తామో ఇప్పటికీ చెప్పడం లేదు. భావనపాడు పోర్టు నిర్మాణం కోసం సంతబొమ్మాళి మండలం మూలపేట, విష్ణుచక్రంను నిర్వాసిత గ్రామాలుగా ప్రభుత్వం గుర్తించింది. పునరావాసం, పరిహారం చెల్లింపుల కోసం రెండు ప్రతిపాదనలను తయారు చేసింది. ఇళ్ల స్థలంతో కలిపి ప్యాకేజీ అందులో మొదటి ప్రతిపాదన కాగా, ఇళ్ల స్థలం లేకుండా రెండో ప్రతిపాదనను నిర్వాసిత కుటుంబాల ముందుంచనుంది. ఇందులో ఒక పిడిఎఫ్ కుటుంబానికి ఇంటి స్థలంతో కలిపి రూ.9,91,000 చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పిడిఎఫ్ కుటుంబంలో చేతివృత్తిదారులు ఉంటే వన్ టైం గ్రాంట్ కింద రూ.25 వేలు, పశువుల శాలకు రూ.25 వేలను పరిహారంగా ఇవ్వనుంది. అంటే ఈ ప్రతిపాదన కింద మొత్తం రూ.10,41,000 చెల్లించనున్నట్లు జాబితాలో పొందుపరిచింది. రెండో ప్రతిపాదనలో ఇంటి స్థలం వద్దనుకుంటే రూ.11,86,000 చెల్లించాలనుకుంటోంది.

రహస్యంగానే ఆర్ అండ్ ఆర్ ప్రతిపాదనలు

వన్ టైమ్ సెటిల్‌మెంట్ కింద నిర్వాసిత కుటుంబానికి ఒక ఇంటి స్థలం ఇవ్వనుంది. ఇంటి స్థలం వద్దనుకుంటే రూ.ఐదు లక్షలు చెల్లించాలని నిర్ణయించింది. ఇంటి స్థలం ఇచ్చే వారికి రూ.3,55,000 విలువ గల స్థలాన్ని అందించనుంది. ఉపాధి కోసం వన్ టైం సెటిల్‌మెంట్ కింద రూ.ఐదు లక్షలు లేదా నెలకు రూ.రెండు వేలు చొప్పున 20 ఏళ్ల పాటు ఇవ్వనున్నట్లు జాబితాలో పొందుపరిచింది. రవాణా ఛార్జీలు, వన్ టైమ్ సెటిల్‌మెంట్ కింద అలవెన్స్ చెరో రూ.50 వేలు చొప్పున చెల్లించనుంది. ఈ ప్రతిపాదనలను మాత్రం బహిర్గతం చేయలేదు.

ఆర్ అండ్ ఆర్‌కు రూ.111.89 కోట్లు అవసరమని గుర్తింపు

ఆర్ అండ్ ఆర్ కింద మొత్తం చెల్లింపులకు రూ.111.89 కోట్లు అవసరమని అధికారులు అంచనా వేశారు. ఇందులో విష్ణుచక్రంలో 86 పిడిఎఫ్ కుటుంబాలు, 66 నిర్మాణాలు (ఇళ్లు, ఇతర నిర్మాణాలు) చెల్లింపులకు రూ.17.64 కోట్లు అవసరమని గుర్తించారు. మూలపేటలో 504 కుటుంబాలు, 354 నిర్మాణాల కోసం రూ.99.24 కోట్లు చెల్లించాల్సి ఉంటుందని నివేదిక తయారు చేశారు.

మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

పొందూరు పిఆర్ ఎఇ సస్పెన్షన్

- పాతపట్నం డిఇ, ముగ్గురు ఎఇలు, పోలాకి హెచ్‌ఎంలకు షోకాజ్ నోటీసులు
- నాడు-నేడు పనుల్లో నిర్లక్ష్యంపై కలెక్టర్ ఆగ్రహం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నాడు-నేడు పనుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పొందూరు పంచాయతీరాజ్ శాఖ ఎఇని సస్పెండ్ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పాతపట్నం డిఇ, బూర్జ, జలుమూరు, కంచిలి ఎఇలతో పాటు పోలాకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయునికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. నాడు-నేడు రెండో విడత పనులపై విద్యాశాఖ, సమగ్ర శిక్ష, ఐసిడిఎస్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారులతో జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండో విడత నాడు-నేడు కింద రివాల్వింగ్ ఫండ్ మంజూరు చేసినా ఇంతవరకు వాటిని వినియోగించుకోలేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. జూనియర్ కళాశాలలు, పాఠశాలలకు పనుల కోసం మంజూరు చేసిన రివాల్వింగ్ ఫండ్‌కు మించి మండలాల్లో పనులు చేపట్టాలని ఆదేశించారు. ఇచ్చిన నిధులు ఖర్చు చేయకుండా అదనపు నిధులు కోరడంలో అర్థం లేదన్నారు. ఇప్పటికైనా ఇచ్చిన నిధుల కంటే అదనపు నిధులను ఖర్చు చేయాలన్నారు. పలాస మండలంలో రూ.2.47 కోట్లు రివాల్వింగ్ ఫండ్ మంజూరు చేయగా, ఇంతవరకు రూ.3.37 కోట్లు ఖర్చు చేసి 137 శాతం, కొత్తూరు 135 శాతం లక్ష్యాలను సాధించడంపై కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు. జలుమూరు మండలానికి రివాల్వింగ్ ఫండ్ కింద రూ.1.76 కోట్లు మంజూరు కాగా రూ.39 లక్షలు ఖర్చు చేసి 23 శాతంతో వెనుకంజలో ఉన్నారన్నారు. పొందూరు మండలానికి రూ.19 లక్షలు రివాల్వింగ్ ఫండ్ మంజూరు కాగా రూ.52 వేలు మాత్రమే ఖర్చు చేయడంపై కలెక్టర్ ఆరా తీశారు. ప్రజాప్రతినిధుల పేరుతో నిర్లక్ష్యం వహించిన ఎఇని సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపారు. పాతపట్నం డిఇ, బూర్జ, జలుమూరు, కంచిలి ఎఇలకు, నాడు-నేడు బిల్లుల అప్‌లోడ్ చేయడంలో నిర్లక్ష్యం వహించిన పోలాకి హెచ్‌ఎంకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. వారంలో ఎఇలు ప్రగతి కనబరచకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి జి.పగడాలమ్మ, సమగ్ర శిక్ష అదనపు పథక సమన్వయ అధికారి ఆర్.జయప్రకాష్, ఐసిడిఎస్ పీడీ కె.ఆదిత్యలక్ష్మి, మండల విద్యాశాఖ అధికారులు, కార్య నిర్వాహక ఇంజినీర్లు, సహాయ కార్యనిర్వాహక ఇంజినీర్లు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పౌరునికి సమ న్యాయం

- కేసుల సత్వర పరిష్కారానికి తోడ్పాటు
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.గోపి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జిల్లా జడ్జి గోపి

ప్రతి పౌరునికి సమన్యాయం అందాలన్నదే న్యాయస్థానాల లక్ష్యమని, ఆ దిశగా రాజ్యాంగం ద్వారా సంక్రమించిన హక్కుల పరిరక్షణకు తోడ్పాటు అందిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.గోపి అన్నారు. జిల్లా కోర్టుల సముదాయంలోని న్యాయ సేవా సదన్ భవనంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన జాతీయ న్యాయ సేవా దినోత్సవాన్ని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌తో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా కేసుల సత్వర పరిష్కారానికి అందరూ సహకరించాలన్నారు. లోక్ అదాలత్ ద్వారా గతంలో కంటే ఎక్కువ కేసులు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పేదల తరుపున వాదించడానికి ప్రతి న్యాయవాది ముందుకు రావాలన్నారు. మెరుగైన న్యాయం అందించాలంటే కేసులకు సంబంధించిన మూలాలను తెలుసుకొని ముందుకు వెళ్లాలని సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రారంభమైనప్పట్నుంచీ అందరికీ సమన్యాయం సులభతరమైందని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఏ పరిధిలోకి రాదని స్పష్టం చేశారు. న్యాయ సేవా చట్టాలు వచ్చాక న్యాయ వ్యవస్థలో పలు మార్పులు వచ్చాయని చెప్పారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసి నాయుడు శ్రీకాకుళం లోక్ అదాలత్‌లో చట్టపరమైన అవగాహన కార్యక్రమాలు, న్యాయ సహాయానికి సంబంధించిన నివేదికను వివరించారు. 2021 నవంబరు నుంచి ఈ ఏడాది అక్టోబరు వరకు జిల్లాలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, మండల న్యాయ సేవాధికార సంస్థల ద్వారా 18,161 పెండింగ్ కేసులు, 24,890 ప్రీ లిటిగేషన్ కేసులను పరిష్కరించామన్నారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు అవగాహనా కార్యక్రమాలను ఈనెల ఒకటి నుంచి 13వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తొలుత న్యాయ సేవా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఛాయాచిత్ర ప్రదర్శనను కలెక్టర్‌తో కలిసి జిల్లా జడ్జి తిలకించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు సెషన్స్ న్యాయమూర్తులు టి.వెంకటేశ్వర్లు, జి.చక్రపాణి, కె.శ్రీదేవి, శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ జి.సువర్ణరాజు, బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బి.ఫల్గుణరావు, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'లో జిల్లా ప్రథమ స్థానం

- సగటు కూలి పెరిగితే మరిన్ని నిధులు వచ్చే అవకాశం
- జెడ్‌పి చైర్‌పర్సన్ పి.విజయ

సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఉపాధి హామీలో జిల్లాలో ఈ ఏడాది 1.40 కోట్ల పనిదినాలను కల్పించి రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ తెలిపారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యాన ఉపాధి హామీ అమలుపై జెడ్‌పి సమావేశ మందిరంలో అవగాహన, సమన్వయ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ మెటీరియల్ కాంపోనెంట్ దినసరి సగటు కూలిపై ఆధారపడి ఉంటుందన్నారు. ప్రస్తుతం రూ.175 ఉన్న సగటు కూలిని రూ.257 పొందేలా మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు చూడాలన్నారు. సర్పంచ్ నుంచి జిల్లాస్థాయి అధికారుల వరకు సమన్వయంతో పనిచేస్తేనే ఇది సాధ్యపడుతుందని అభిప్రాయపడ్డారు. గతేడాది సకాలంలో పనులు చేపట్టకపోవడం వల్ల కొన్ని కోట్లను నష్టపోయామన్నారు. ఇంకా ఐదు నెలల గడువు ఉన్నందున ప్రణాళిక ప్రకారం పనులు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రాధాన్యతా భవనాలను శత శాతం పూర్తి చేసి, ఆ తదుపరి మిగిలిన పనులు చేపట్టాలన్నారు. చేపట్టిన పనులకు బిల్లులను ఎప్పటికప్పుడు నమోదు చేయడం ద్వారా ఖర్చు చేసిన నిధులు పొందవచ్చన్నారు. ఉపాధి కూలీలకు ఎంత మొత్తంలో కూలి చెల్లిస్తామో అంతే మొత్తంలో మెటీరియల్ కాంపోనెంట్ పొందే అవకాశం ఉందన్నారు. దినసరి కూలి పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.

జిల్లాలో ఉపాధి హామీ కింద ఇప్పటివరకు 1.40 కోట్ల పనిదినాలు కల్పించి రూ.280 కోట్లు కూలి కింద చెల్లించినట్లు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తెలిపారు. తద్వారా రూ.200 కోట్లు మెటీరియల్ కాంపోనెంట్ లభించిందని చెప్పారు. అన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు ఇంకా ఐదు నెలలు గడువు ఉన్నందున మరో 60 లక్షల పని దినాలను కల్పించే అవకాశముందన్నారు. ఇంత పెద్దఎత్తున చేపట్టే కార్యక్రమంపై ప్రజాప్రతినిధులు, అధికారులకు అవగాహన, సమన్వయం లేకపోవడం వల్ల సరిగ్గా వినియోగించుకోలేకపోతున్నామని చెప్పారు. జిల్లాలో ఆరు లక్షల జాబ్ కార్డుదారులు ఉన్నారని, వీరందరికీ పనిదినాలను కల్పిస్తున్నామని తెలిపారు. జిల్లాలో పిల్ల కాలువలు ఎన్నో ఉన్నాయని, ఎన్నో ఏళ్లుగా పూడిక తీయకపోవడంతో సరిగ్గా నీటిని పొందలేకపోతున్నారని, వాటిని వినియోగించుకోవడం ద్వారా రైతులు నీటిని, కూలీలు కూలిని పొందవచ్చన్నారు. సకాలంలో పనులు చేయకపోవడం వల్ల గతేడాది రూ.190 కోట్లు నష్టపోయామని, ఈ ఏడాది దాన్ని అధిగమించాలని డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు కోరారు. కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్, జిల్లా విజిలెన్స్ అధికారి ఆర్.లవరాజు, కార్యక్రమ అధికారి కె.వి.అప్పలనాయుడు, సహాయ పథక సంచాలకులు శైలజ, జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు, ఎంపిడిఒలు, పంచాయతీరాజ్ కార్యనిర్వాహక అధికారులు, ఇంజినీరింగ్ కన్సల్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమిత్రల నియామకానికి నోటిఫికేషన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో ఆరోగ్యశ్రీ నిర్వహణలో భాగంగా ఖాళీగా ఉన్న ఆరు ఆరోగ్యమిత్ర పోస్టుల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి తెలిపారు. గతంలో ఇచ్చిన రెండు నోటిఫికేషన్లను పరిపాలనా కారణాల వల్ల రద్దు చేయడమైందని, కొత్తగా ఈనెల 17వ తేదీ లోగా తిరిగి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బిఎస్‌సి నర్సింగ్, ఎంఎస్‌సి నర్సింగ్, బి.ఫార్మసీ, ఫార్మసీడి, ఎంఎల్‌టి విద్యార్హత కలిగి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. బిసి-బి మహిళ 2, ఎస్‌సి మహిళ 1, ఎస్‌సి జనరల్ 1, ఎస్‌టి మహిళ 1, బిసి-సి జనరల్ 1 కేటగిరీలకు కేటాయించినట్లు పేర్కొన్నారు. అర్హత గల అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అభ్యంతరాల స్వీకరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వంశధార నదిపై మహేంద్రతనయ ఆఫ్‌షోర్ రిజర్వాయర్ నిర్మాణానికి రూ.852.45 కోట్లకు ప్రభుత్వం పరిపాలనా ఆమోదం తెలిపిందని వంశధార ఎస్ఇ డోల తిరుమలరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో మిగులు పనులకు గానూ చీఫ్ ఇంజనీర్ రూ.492.00 కోట్లకు సాంకేతిక అనుమతి ఇచ్చారని తెలిపారు. రిజర్వాయర్, కాలువల పనులకు రూ.288.26 కోట్లకు జ్యుడీషియల్ ప్రివ్యూకు పంపిన తర్వాత టెండరును పిలవనున్నట్లు తెలిపారు. వీటిపై సలహాలు, సందేహాలు, అభ్యంతరాలు ఉంటే వారం రోజుల్లో ఫిర్యాదు చేయాలని సూచించారు. వీటి వివరాలన్నీ https://judicialpreview.ap.gov.in వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు.

ఓటు హక్కు కీలకం

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఓటు హక్కు కీలకమని, ఓటు ప్రాముఖ్యతను ప్రతిఒక్కరూ తెలుసుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నిక అధికారి శ్రీకేష్ లాఠకర్ అన్నారు. నగరంలోని బాపూజీ కళామందిర్‌లో బుధవారం నిర్వహించిన స్వీప్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలన్నారు. జిల్లా జనాభా 28 లక్షలు అయితే 18 లక్షల మంది ఓటు హక్కు కలిగి ఉన్నారని తెలిపారు. ఓటు హక్కు వినియోగించని వారికి అవగాహన కల్పించడం ఎంతో అవసరమన్నారు. స్వీప్ కార్యక్రమ నిర్వహణ ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వీలుందన్నారు. వచ్చే ఏడాదికి 18 ఏళ్లు నిండనున్న ప్రతిఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలన్నారు. ఈ నమోదు ప్రక్రియ ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లో చేసుకోవచ్చన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి మాట్లాడుతూ స్వీప్ కార్యక్రమాల్లో యువత ప్రధాన పాత్ర పోషించాలన్నారు. ఓటు హక్కు కోసం ఎలా దరఖాస్తు చేసుకోవాలో ప్రతిఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ బొడ్డేపల్లి శాంతి, తహశీల్దార్ కె.వెంకటరావు, స్వీప్ డైరెక్టర్, విద్యాసంస్థల అధినేత జామి భీమ శంకరరావు, స్వీప్ స్వచ్ఛంద సంస్థ కె.రమణమూర్తి, టౌన్ ప్లానింగ్ అధికారి సీతారాం, పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

సూచనలు చేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ

- ఓటర్ల నమోదుకు డిసెంబరు 8 తుది గడువు
- జనవరి 5న తుది ఓటర్ల జాబితా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలను అనుసరించి ముసాయిదా ఓటర్ల జాబితాను బుధవారం ప్రకటించారు. ఈ నెల 9వ తేదీ నాటికి 1832021 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 905085 మంది, స్త్రీలు 910542 మంది ఉన్నారు. ఇతరులు 203 మంది ఉన్నారు. ఓటర్ల నమోదుకు ఈ ఏడాది డిసెంబరు 8వ తేదీ వరకు అవకాశం కల్పిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ వెల్లడించారు. ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల తొమ్మిది నుంచి డిసెంబరు ఎనిమిదో తేదీ వరకు గడువు నిర్ణయించినట్లు తెలిపారు. ఈనెల 19, 20, డిసెంబరు 3, 4 తేదీల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు రోజులుగా నిర్ణయించామన్నారు. వచ్చే ఏడాది జనవరి 5వ తేదీన సవరించిన తుది ఓటర్ల జాబితాను ప్రకటించనున్నట్లు తెలిపారు. జిల్లాలో 18 ఏళ్లు నిండిన వారైనా, గడువు లోగా నిండుతున్న వారైనా ఓటుహక్కు పొందడానికి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రత్యేక ఓటర్ల నమోదు రోజుల్లో బూత్ లెవల్‌లో అధికారులు పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వారు www.nvsp.inలో ఫారాలను నమోదు చేసుకోవచ్చన్నారు. ఎన్నికల సమాచారం కోసం 1950 టోల్ ఫ్రీ నంబరుకు గానీ జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలో గానీ సంప్రదించాలన్నారు. దరఖాస్తులు ఇఆర్ఒ, తహశీల్దార్, బిఎల్ఒ కార్యాలయాల్లో సమర్పించవచ్చని చెప్పారు.

పిడిఎస్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - టెక్కలి

స్వాధీనం చేసుకున్న పిడిఎస్ బియ్యం

అక్రమంగా తరలిస్తున్న 27 మెట్రిక్ టన్నుల పిడిఎస్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. విజిలెన్స్ ప్రాంతీయ నిఘా అమలు అధికారి పి.వి రవికుమార్ ఆదేశాల మేరకు విజిలెన్స్, రెవెన్యూ అధికారులు బుధవారం తనిఖీలు చేపట్టారు. ఎపి 30యు 6833 నంబరు గల లారీని ఆపి తనిఖీ చేయగా రూ.10,56,780 విలువ గల 27 మెట్రిక్ టన్నుల పిడిఎస్ బియ్యం పట్టుబడ్డాయి. లారీలో వాటిని తరలిస్తున్న భీమా సాహు, విష్ణుషాను ప్రశ్నించగా టెక్కలి పట్టణానికి చెందిన బోయిన పవన్ కుమార్ ప్రజల వద్ద నుంచి సేకరించి ఇచ్ఛాపురానికి చెందిన ఎల్.గుణకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. బియ్యాన్ని, లారీని సీజ్ చేసి సంబంధిత అక్రమ రవాణాదారులపై కేసు నమోదు చేశారు. విజిలెన్స్ డిఎస్‌పి కిరణ్ కుమార్, సిఐ సింహాచలం, ఎస్ఐ అశోక్, హెడ్ కానిస్టేబుల్ రామ్మోహన్, టెక్కలి పౌర సరఫరాల డిటి గిరిబాబు పాల్గొన్నారు.

విలేకర్లతో మాట్లాడుతున్న రమాప్రభ

ఉత్తరాంధ్ర అభివృద్ధికి కృషి చేస్తా

పట్టభద్రుల ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభ

ప్రజాశక్తి- సీలేరు

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే ఉత్తరాంధ్ర అభివృద్ధికి కృషి చేస్తానని ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక, ప్రజా సంఘాలు బలపర్చిన పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ అన్నారు. బుధవారం సీలేరు వచ్చిన ఆమె పట్టభద్రులను కలిసి తనకు ఓట్లు వేయాలని అభ్యర్థించారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలో ఉన్న జీవ నదులపై ప్రాజెక్టులు నిర్మించకపోవడం వల్లే ఉత్తరాంధ్ర వెనుకబాటుకు కారణమని చెప్పారు. దీంతో ఇక్కడ పనుల్లేక రైతులు కూలీలు వలసబాట పడుతున్నారన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి దశాబ్దాలు గడిచినా నేటికీ పనులు ప్రారంభం కాలేదని తెలిపారు. ఉపాధి అవకాశాలు లేకపోవడంతో ఇక్కడున్న పట్టభద్రులు వేరే పట్టణాలకు వలస పోతున్నారన్నారు. వలసలను అరికట్టడానికి కొత్త ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టడంతో పాటు ఉపాధి ఇస్తున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని నొక్కిచెప్పారు. తనను ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపిస్తే శాసనమండలిలో ఉత్తరాంధ్ర వాణిని వినిపిస్తానని, ఈ ప్రాంతంలో పోరాడే వారి తరుపున నిలబడతానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కె.త్రిమూర్తులు రెడ్డి, గాలకొండ ఎంపిటిసి అంపరంగి బుజ్జిబాబు పాల్గొన్నారు.

పోటీలను ప్రారంభిస్తున్న సుందరరావు

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పి.సుందరరావు అన్నారు. నగరంలోని టౌన్ హాల్‌లో జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన జిల్లా స్థాయి తైక్వాండో, ఫెన్సింగ్ పోటీలను బుధవారం ప్రారంభించారు. ఈ మాట్లాడుతూ పాఠశాల స్థాయిలోనే క్రీడలపై ఆసక్తి పెంచుకున్న వారికి మంచి భవిష్యత్ సాధ్యమవుతుందన్నారు. క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభా పాటవాలను వెలుగులోకి తీసుకొచ్చేందుకు ఈ పోటీలు ఎంతగానో దోహదపడతాయన్నారు. క్రీడాకారులు మెలకువలను నేర్చుకుని రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. స్కూల్ గేమ్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి బి.వి.రమణ మాట్లాడుతూ చదువుతో పాటు విద్యార్థులకు క్రీడలూ అవసరమన్నారు. క్రీడల ద్వారా క్రమ శిక్షణ అలవడుతుందని పేర్కొన్నారు. శారీరక దృఢాన్ని అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో పిడి, పిఇటిల అసోయేషన్ జిల్లా అధ్యక్షుడు ఎం.వి.రమణ, కార్యదర్శి సాంబమూర్తి, పోలినాయుడు, నిర్మల్ కుమార్, హ్యాండ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి శేఖర్, సినీ నిర్మాత బలగ ప్రకాష్, దళిత సంఘాల జెఎసి నేత కంఠ వేణు, తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తైక్వాండో శ్రీను, ఫెన్సింగ్ జిల్లా అధ్యక్షుడు వైశ్యరాజు మోహన్ పాల్గొన్నారు.

క్రీడలను ప్రారంభిస్తున్న దువ్వాడ శ్రీనివాస్

క్రీడలతో మానసికోల్లాసం

టెక్కలి: విద్యార్థులు చదువుతో పాటు మానసిక ఆనందానికి క్రీడలు దోహదపడతాయని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జిల్లా స్థాయి రగ్బీ, నెట్‌బాల్, వెయిట్ లిఫ్టింగ్, రూప్ స్కిప్పింగ్ వంటి జిల్లా స్థాయి క్రీడా ఎంపికలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడల్లో రాణించి మంచి భవిష్యత్ పొం దాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు బాడాన నారాయణరావు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి అట్ల సరోజనమ్మ, సర్పంచ్ గోండేల సుజాత, నెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వైకుంఠరావు పాణిగ్రాహి, ఉప సర్పంచ్ గండి విశ్వశాంతిరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు బాడాన నారాయణరావు, లక్ష్మణరాజా, కాపల రఘునాతరావు, ఆదిశేష్, వాసుదేవరావు, లక్ష్మీనారాయణ, రమణ, యాగాటి త్రినాథరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎంపికైన విద్యార్థులతో కోచ్

తైక్వాండోలో క్రీడాకారుల ప్రతిభ

టెక్కలి: జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్‌లో టెక్కలి తైక్వాండో క్రీడాకారులు ప్రతిభ కనబర్చారని కోచ్ నర్సిపురం శేఖర్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ క్రీడా వికాస కేంద్రంలో శిక్షణ పొందిన కె.తాస్వీ, పి.మోస్వంత్, ఆర్.హసిని, ఎన్.సంజన, ఎస్.అభిషేక్, ఎన్.గణపతి ఈపోటీల్లో రాణించారని తెలిపారు. వారికి డిఎస్‌డిఒ మాధురిలత, కోచ్ అభినందులు తెలిపారు.

అంగన్వాడీ తాత్కాలిక సూపర్‌వైజర్ పోస్టుల నియామకంలో మాయాజాలం నెలకొంది. సీనియర్లను కాదని, కొత్త వారికి అవకాశం ఇవ్వడంపై ఐసిడిఎస్ తీరుపై సర్వత్రా చర్చ సాగుతోంది. అధికార పార్టీ నేతల సూచనలు పాటించారని మరోవైపు ఆరోపణలు వినిపిస్తున్నా.., అధికారులు మాత్రం నిబంధనలు పాటించే పోస్టులను భర్తీ చేశామని చెప్పడం విశేషం.

అంగన్వాడీ పోస్టుల నియామకంలో మాయాజాలం!

- సీనియర్లను కాదని కొత్త వారికి అవకాశం
- నిబంధనలు పాటించాం : ఐసిడిఎస్ పిఒ

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో పలాస, కాశీబుగ్గ, వజ్రపుకొత్తూరు, నందిగాం మండలాల పరిధిలో 291 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. మూడేళ్ల క్రితం అంగన్వాడీ కార్యకర్తలైన పైల అరుణ, దానమ్మ, ధనలక్ష్మి, పద్మ, ఇందిరాలను తాత్కాలిక సూపర్‌వైజర్లుగా నియమించారు. వారు తమ అంగన్వాడీ కేంద్రంలో పని చేస్తూనే అదనంగా సూపర్‌వైజర్ విధులు నిర్వహించేవారు. దీనికి ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా వారికి చెల్లించలేదు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ సూపర్‌వైజర్ పోస్టుల భర్తీకి పరీక్షలు నిర్వహించింది. ఈ పోస్టుల నియామకంలో అవకతవకలు జరిగాయని తీవ్ర విమర్శలు వచ్చాయి. పలువురు అంగన్వాడీలు కోర్టును ఆశ్రయించడంతో.. కోర్టు ఈ ప్రక్రియను నిలుపుదల చేసింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఆ స్థానంలో తాత్కాలిక సూపర్‌వైజర్లను నియమించాలని జిఒ జారీ చేసింది. కాశీబుగ్గ ఐసిడిఎస్ సెక్టార్ పరిధిలో పలాస, పలాస రూరల్, కాశీబుగ్గ, నందిగాం మండలాలకు సంబంధించి నాలుగు తాత్కాలిక సూపర్‌వైజర్ పోస్టులు నియమించాల్సి ఉంది. దీంతో కాశీబుగ్గ ఐసిడిఎస్ అధికారులు అరుణ, దానమ్మ, సునీత, కోకిలను తాత్కాలిక సూపర్‌వైజర్లుగా నియమించారు. వాస్తవంగా గతంలో పని చేసిన పైల అరుణ, దానమ్మ, ధనలక్ష్మి, పద్మ, ఇందిరాలను తీసుకోవాల్సి ఉండగా, వారిలో పైల అరుణ, దా నమ్మకు మాత్రమే అవకాశం కల్పించారు. మరో ఇద్దరు కొత్త వారిని తాత్కాలిక సూపర్‌వైజర్లుగా నియమించారు. దీంతో కాశీబుగ్గ ఐసిడిఎస్ సెక్టార్‌లో అనుమానాలు రేకెత్తాయి. అధికారులు అవినీతికి పాల్పడ్డారని, పాతవారిని తీసుకోకుండా కొత్తవారికి అవకాశం ఇవ్వడంపై ఆరోపణలు వచ్చాయి.

కొత్త వారిని ఎలా నియమిస్తారు?

సీనియర్లను కాదని కొత్త వారితో తాత్కాలిక సూపర్‌వైజర్ పోస్టులను నియమించడం సరికాదు. అధికారులు నిబంధనలు పాటించామని చెబుతున్నారు. అందులో వాస్తవం లేదు. దాన్ని సరి చేయాలి.

- కె.జ్యోతి, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కాశీబుగ్గ ఐసిడిఎస్ ప్రాజెక్టు అధ్యక్షులు

తాత్కాలిక సూపర్‌వైజర్ పోస్టుల నియామక పత్రాలను అందిస్తున్న పిఒ శార్వాణి (ఫైల్)

నిబంధనల మేరకే నియమించాం

నిబంధనల మేరకే తాత్కాలిక అంగన్వాడీ సూపర్‌వైజర్లను నియమించాం. వస్తున్న ఆరోపణల్లో ఎటువంటి నిజం లేదు. విలీనం కానున్న అంగన్వాడీ ప్రాంతాల్లోనే సూపర్‌వైజర్‌గా నియమించాం.

- శార్వాణి, ఐసిడిఎస్ పిఒ

పిఒ తీరుపై అంగన్వాడీల నిరసన

పలాస: తాత్కాలిక అంగన్వాడీ సూపర్‌వైజర్ పోస్టుల భర్తీలో ఐసిడిఎస్ పిఒ శార్వాణి అనుసరించిన తీరును అంగన్వాడీలు తప్పుబట్టారు. బుధవారం సిఐటియు నాయకులు ఎన్.గణపతి, అంగర్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన ఎంపిడిఒ కార్యాలయం వద్ద అంగన్వాడీలు నిరసన తెలిపారు. తొలుత ఎంపిడిఒ కార్యాలయంలో ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీలతో ఐసిడిఎస్ అధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిటియు నాయకుడు ఎన్.గణపతి మాట్లాడుతూ డిగ్రీ, పిజి అర్హతలు కలిగి, సీనియారిటీ ఉన్న వారికి విస్మరించి పదో తరగతి విద్యార్హత కలిగిన వారిని తాత్కాలిక సూపర్‌వైజర్లుగా ఎలా నియమిస్తారని ప్రశ్నించారు. నిబంధనలు తుంగలో తొక్కి నియామకాలు చేపట్టారని విమర్శించారు. దీనిపై ఐసిడిఎస్ పిఒ శార్వాణి మాట్లాడుతూ మంత్రి సీదిరి అప్పలరాజు చెప్పడం వల్లే నియమించామని వివరణ ఇచ్చారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు బి.సునీత, కె.జ్యోతి, బి.నిర్మల, ఢిల్లేశ్వరి, లోహితాక్షి, కె.కృష్ణవేణి, అప్పలనరసమ్మ, బి.చామంతి, ఎల్.దమయంతి, ఆదిలక్ష్మి, పి.పద్మావతి, యు.అలివేణి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్వాడీలు

అక్కడ ఒక్కరే...

చిల్లవానిపేట ప్రభుత్వ పాఠశాలలో ఒకే విద్యార్థి

ప్రజాశక్తి- రణస్థలం

ప్రభుత్వ స్కూళ్లను పటిష్టం చేయడంతో పాటు విద్యార్థుల సంఖ్యను పెంచడం, మెరుగైన విద్యాబోధన కల్పించడమే లక్ష్యంగా అమ్మఒడి, విద్యాకానుక, నాడు-నేడు వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోంది. కానీ, కొన్నిచోట్ల ఆయా పథకాల ఫలితాలు మాత్రం కనిపించడం లేదు. ఓ ప్రాథమిక పాఠశాలలో అయితే ఏకంగా ఒక్క విద్యార్థికి ఒక్క ఉపాధ్యాయుడు ఉండటం ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తుంది....కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేస్తుంది... మెరుగైన సౌకర్యాలు కల్పింది...క్వాలిఫైడ్ ఉపాధ్యాయులతో విద్యను బోధన అందిస్తుంది... అయినా ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులు లేక వెలవెలబోతున్నాయి. పట్టుమని పది మంది కూడా లేని స్కూళ్లున్నాయంటే వినడానికే ఆశ్చర్యం కలగకమానదు.

విద్యార్థి సెలవుతో ఒక్కరే ఉన్న ఉపాధ్యాయుడు

రణస్థలం మండలంలోని చిల్లపేటలోని ప్రాథమిక పాఠశాలలో అయితే ఒక్కరంటే ఒక్క విద్యార్థిని మాత్రమే చదువుతుంది. ఈమె పేరు ఇంద్రజ. చిల్లపేట పాఠశాలలో ఐదో తరగతి చదువుతుంది. ఈ స్కూల్‌లో ఈ ఒక్కరే విద్యార్థిని పాఠాలు చెప్పేందుకు ఉపాధ్యాయుడు ఇ.మోహన్‌బాబు కూడా ఒక్కరే. ఈ స్కూల్ మొత్తంగా చూస్తే ఒక టీచర్, ఒక స్టూడెంట్ అంతే. గతేడాది ఇదే స్కూల్లో 12 మంది విద్యార్థులు చదువుకోగా, ఈ సారి మాత్రం ఆ సంఖ్య ఒకటికి పడిపోయింది. దీంతో ఆటలు, పాఠాలు అన్నీ ఆ ఒక్క విద్యార్థితోనే. అయితే ఈ స్కూల్‌లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపడం లేదు. ఎందుకంటే ఈ ఉపాధ్యాయుడు పాఠశాలకు సక్రమంగా రావడం లేదని చిల్లపేట గ్రామస్థులు బహిరంగంగా ఆరోపించారు. అందుకే విద్యార్థులను పంపించేందుకు ఇష్టపడటం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

గతంలో స్కూల్‌లో విద్యార్థుల సంఖ్య ఎక్కువగానే ఉండేదని, క్రమంగా ఆ సంఖ్య తగ్గడంతో ఉపాధ్యాయులూ ఈ పాఠశాలను ఎంచుకోవడం లేదని తెలుస్తోంది. ఉన్న ఒక్క విద్యార్థినీ రావడం మానేస్తే స్కూల్ మూసేయాల్సిన పరిస్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ స్కూల్ విషయంలో అధికారులు ఏదైనా పరిష్కారం చూపించాల్సి ఉంది. లేకపోతే మూతపడిన జాబితాలో ఈ పాఠశాల పేరునూ చేర్చాల్సి వస్తుంది. ఆ విద్యార్థిని బుధవారం పాఠశాలకు సెలవు పెట్టడంతో ఉపాధ్యాయుడు ఖాళీగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ విషయంపై ఎంఇఒ త్రినాథరావుని వివరణ కోరగా, చిల్లపేట పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థిని ఉండడంతో పాఠశాల నడుపుతున్నామని తెలిపారు.

కృపారాణి మృతదేహం

రోడ్డు ప్రమాదంలో విద్యార్థిని దుర్మరణం

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని మహర్తాపురం వద్ద బుధవారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో పాతపట్నానికి చెందిన విద్యార్థిని పూడి కృపారాణి (16) మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే... కృపారాణి పాతపట్నంలోని కిరణ్మయి జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపిసి చదువుతుంది. బుధవారం ఉదయం కళాశాలకు వెళ్లి వస్తానని తల్లిదండ్రులు పద్మ, శ్రీరాముకు చెప్పి బయలుదేరింది. ఇంటిని నుంచి బయటకు వచ్చిన తర్వాత కొత్తూరుమండలం కుంటిభద్రకు చెందిన స్నేహితుడు తాటికొండ శ్యామ్‌కు ఫోన్ చేసింది. కొరసవాడలో ఉంటున్న శ్యామ్ వచ్చాక బైక్‌పై సీతంపేట పార్కు వెళ్లారు. కళాశాల విడిచిపెట్టే సమయానికి వెళ్లిపోవాలని ముందు అనుకున్నారు. కానీ పార్కులో ఆలస్యం కావడంతో కళాశాల విడిచిపెట్టే సమయానికి పాతపట్నం చేరుకోవాలని నిర్ణయంతో అతి వేగంగా వస్తున్నారు. కొత్తూరు నుంచి కుంటిభద్ర వెళ్తున్న ట్రాక్టర్‌ను మహర్తాపురం వద్ద ఓవర్‌టేక్ చేస్తుండగా... వెనుక ట్రాక్‌ను బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో కృపారాణి కిందకు పడిపోవడంతో తలకు తీవ్ర గాయమైంది. ఈ ప్రమాదంలో ఘటనాస్థలంలోనే ఆమె మృతి చెందగా, శ్యామ్ స్వల్ప గాయాలతో బయటకు పడ్డాడు. వెంటనే స్థానికులు క్షతగాత్రుడిని 108లో కొత్తూరు సామాజిక ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని కొత్తూరు ఆస్పత్రికి తరలించారు. శ్యామ్‌ది కొత్తూరు మండలం కుంటిభద్ర. తల్లిదండ్రులు వలస వెళ్లడంతో తాత గారి ఊరు కొరసవడ ఉంటూ ఎలక్ట్రిషియన్ పనులు చేసుకుంటున్నాడు. స్థానికులు కృపారాణి తల్లిదండ్రులకు ఫోన్‌లో మృతి విషయాన్ని అందజేశారు. తల్లిదండ్రులు తమ అమ్మాయి కళాశాలకు వెళ్లిందని, ఆమె ఎవరో తెలియదని చెప్పారు. అనంతరం కళాశాలకు ఫోన్ చేయగా... యాజమాన్యం రాలేదని చెప్పడంతో అవాక్కయ్యారు. హుటాహుటిన ఆస్పత్రికి చేరి కుమార్తెను గుర్తించి కన్నీరుమున్నీరుగా విలపించారు. పోస్టుమార్టం నిమిత్తం పాలకొండ ఏరియా ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించారు. ఇన్‌ఛార్జి ఎస్ఐ నారాయణస్వామి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజలను మభ్య పెట్టడంలో ధర్మాన దిట్ట

మాజీ మంత్రి అప్పలసూర్యనారాయణ

శ్రీకాకుళం అర్బన్ : ప్రజలను మభ్యపెట్టడానికి తన వాక్చాతుర్యాన్ని ప్రదర్శించడంలో రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు దిట్టని, అందులో భాగంగానే సంస్కరణలు ప్రజలకు అర్థం కాకపోవడం వల్ల వైసిపిపై వ్యతిరేకత ఉందని మాట్లాడుతున్నారని మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ వ్యాఖ్యానించారు. అరసవల్లిలోని ఆయన స్వగృహంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. వైసిపి ప్రభుత్వంపై వ్యతిరేకత, సంస్కరణలు అని ధర్మాన మాట్లాడడం వెనుక వ్యూహం దాగి ఉందన్నారు. ప్రభుత్వం గడచిన మూడున్నరేళ్లలో తీసుకొచ్చిన సంస్కరణలు ఏమిటో, అందులో ప్రజలకు అర్థం కాని రహస్యం ఏమిటో ఆయనకే తెలియాలన్నారు. ఎన్‌టిఆర్ హెల్త్ యూనివర్సిటీ పేరును వైఎస్ఆర్ హెల్త్ యూనివర్సిటీగా మార్చటం, అన్న క్యాంటీన్లను ప్రయివేటు హోటళ్లకు ఇవ్వడం ఆయన చెపుతున్న సంస్కరణల్లో భాగమే అవుతుందన్నారు. అలాగే గత ప్రభుత్వంలో మంజూర్లు, చేపట్టిన అభివృద్ధి పనులను మధ్యలో నిలిపివేయడం, టిడ్కో ఇళ్లను మూడున్నరేళ్లుగా ప్రజలకు ఇవ్వకుండా గాలికి వదిలేయడం ఏ సంస్కరణల కిందకు వస్తుందో ఆయనే చెప్పాలని డిమాండ్ చేశారు. మూడు రాజధానుల అంశం ప్రస్తుతం సుప్రీం కోర్టులో ఉండగా, ప్రజలను రెచ్చగొట్టే విధంగా సభలు, సమావేశాలు నిర్వహించడం దేని కిందకు వస్తుందో చెప్పాలని అన్నారు. పదవి ఉన్నా, పవర్ లేదన్న ఆక్రోశం ఆయన మాటల్లో ప్రజలకు అర్థమవుతోందని వ్యాఖ్యానించారు. సమావేశంలో టిడిపి నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షులు పి.ఎం.జె.బాబు, పట్నాల పార్వతీశం, కోల శ్రీనివాసదేవ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అప్పలసూర్యనారాయణ

ఎఎన్ఎంకు సన్మానం

నందిగాం: మండలంలోని దిమ్మిడిజోల హెల్త్ సబ్ సెంటర్ పరిధిలో ఎఎన్ఎంగా బి.సుశీల 30 ఏళ్లుగా పని చేస్తోంది. ఉద్యోగోన్నతిపై పలాస మండలం రెంటికోట బదిలీ అయ్యింది. ఈ సందర్భంగా సుశీల, రసింహమూర్తి దంపతులను సర్పంచ్ ప్రతినిధి సలాన కృష్ణారావు, వైస్ ఎంపిపి రేగల లక్ష్మీకాంతం, కూర్మారావు, గ్రామస్తులు బుధవారం ఘనంగా సత్కరించారు. అంకిత భావంతో పని చేస్తే కీర్తి, ప్రతిష్టతలు అవే వస్తాయన్నారు. ఆమె సేవలను ఎప్పటికీ మరువలేమని అన్నారు.

మాట్లాడుతున్న సూరయ్య

సిఐటియు జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి

మెళియాపుట్టి: ఈ నెల 26, 27 తేదీల్లో నిర్వహించే సిఐటియు జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.సూరయ్య కోరారు. బుధవారం పాతపట్నం మార్కెట్ యార్డులో సారవకోట ప్రాజెక్టు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాలుగో మహాసభ బి.శాంతిమణి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సూరయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్త్రీ సంక్షేమ పథకాలు ఎత్తివేసే ప్రయత్నంలో ఉన్నాయన్నారు. కార్మికచట్టాలు మార్చి, కనీస వేతనం రూ.26వేలు అమలు చేయడం లేదన్నారు. ఈ నెల నిర్వహించే మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం ప్రాజెక్టు నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎస్.శారద, ఉపాధ్యక్షులుగా డి.లలిత, కార్యదర్శిగా ఎం.భాగ్యలక్ష్మి, జాడుపల్లి సహాయ కార్యదర్శిగా డి.శ్రీలక్ష్మి, కోశాధికారిగా సుజాతను ఎనుకున్నారు.

హనుమాన్ ఆలయం సందర్శన

నందిగాం: మండలంలోని నౌగాంలోని అభయాంజనేయస్వామి ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా ఆలయాన్ని శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు బుధవారం సందర్శించారు. దత్త పీఠాధిపతి నిర్విషియానంద స్వామి, వుదికల పాడు పీఠాధిపతి కరుణాకర్ ఆధ్యాత్మిక ప్రసంగాన్ని ఇచ్చారు. లక్ష్మణరావు, సబ్బి జానకిరామ్, పి.అజయ్‌కుమార్, చంద్రశేఖర రావు, హేమంత్, ప్రసాదరావు పాల్గొన్నారు.

ఆలయాన్ని సందర్శించిన ఎంపీ రామ్మోహన్‌నాయుడు

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

రాష్ట్ర స్థాయి అండర్-17, 14 హ్యాండ్ బాల్ పోటీలకు జగన్నాథపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం బల్ల కంటయ్య తెలిపారు. విద్యార్థుల ఎంపికపై సర్పంచ్ జోగి రాములమ్మ, ఎంపిటిసి జొన్న సవరరాజు అభినందనలు తెలిపారు. అభినందనలు తెలిపిన వారిలో పిఇటి ప్రసాదరావు, ఉపాధ్యాయులు అనంతరావు, దాలప్పన్న, గ్రామస్తులు, యువత ఉన్నారు.

విద్యార్థులకు అభినందిస్తున్న హెచ్‌ఎం కంటయ్య

చేనేత కార్మికుల నైపుణ్యాలను పెంపొందించాలి

చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న ఇంటాక్ సంస్థ సభ్యులు

ప్రజాశక్తి- పొందూరు

చేనేత కార్మికులలో నైపుణ్యాలను పెంపొందించడం ద్వారా చేనేత రంగాన్ని అభివృద్ధి పరచవచ్చునని న్యూఢిల్లీకి చెందిన భారత జాతీయ కళలు మరియు సంస్కృతి వారసత్వ సంస్థ (ఇంటాక్) జిల్లా కన్వీనర్ ఎన్.సన్యాసిరావు అన్నారు. పొందూరు దేవాంగుల వీధిలో ఇంటాక్ సంస్థ అదనపు సమన్వయకర్త వావిలపల్లి జగన్నాథనాయుడు అధ్యక్షతన బుధవారం 'చేనేత పరిశ్రమలో నైపుణ్యాల పెంపుదల సదస్సు'ను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ చేనేత కార్మికుల ఆర్థిక స్థితిగతులు నానాటికీ దిగజారుతున్నాయని, వస్త్రాల ధరలు పెరుగుతున్నా కార్మికులకు పనికి తగ్గ వేతనం లభించడం లేదని అన్నారు. చేనేత కార్మికులకు మరింతగా మెరుగైన నైపుణ్యాలను అందించాల్సిన అవసరం ఉందన్నారు. కార్మికులు మాట్లాడుతూ ఈ వృత్తి గిట్టుబాటు కాకపోవడంతో యువత వేరే వృత్తులను ఎంచుకుంటున్నారని, దీంతో మా తరంతోనే ఈ వృత్తి అంతరించిపోతుందోనన్న ఆందోళనను వ్యక్తం చేశారు. ఇంటిల్లిపాదీ రోజంతా కష్టపడినా కనీసం మూడొందలు రావడం లేదని ఆవేదనను వ్యక్తం చేశారు. చేనేత కుటుంబాల వారీగా జియో ఐడెంటిటీ ట్యాగింగ్ నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం చేనేత వస్త్రాల తయారీని పరిశీలించారు. కార్యక్రమంలో సంస్థ పూర్వ జిల్లా కన్వీనర్ కె.వి.జె.రాధాప్రసాద్, సహ సమన్వయకర్త నటుకుల మోహన్, సభ్యులు తర్లాడ అప్పలనాయుడు పాల్గొన్నారు.

పెరటితోటల పెంపకంపై శిక్షణ

రణస్థలం: గృహిణులు వారి ఇంటి చుట్టూ ఉన్న ఖాళీ స్థలాల్లో కూరగాయలు, పళ్లు సంవత్సరం పొడవునా పండించి గృహ అవసరాలకు వాడుకుంటే తాజా కూరగాయలతో పాటు కుటుంబమంతా మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పొందవచ్చని ఆముదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి అన్నారు. డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యాన లావేరు మండలంలో చిన్నరొంపివలస వల్ల గృహిణులకు పెరటి తోటల పెంపకంపై గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సునీత బుధవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మనం తీసుకునే ఆహారంలో శరీరానికి అవసరమైన ఖనిజ లవణాలు, విటమిన్లు వంటి పోషక విలువలు కూరగాయల్లోనే సమృద్ధిగా లభిస్తాయన్నారు. వీటిని ఆహారంలో విరివిగా ఉపయోగించడం వల్ల రోగ నిరోధక శక్తి వృద్ధి చెందుతుందన్నారు. ఇంటి చుట్టూ అందుబాటులో ఉన్న స్థలానికి అనుగుణంగా వివిధ రకాల నమూనాలు, అందులో పెంచాల్సిన సంపూర్ణ పోషకాహార పంటలను సూచించారు. అనంతరం గృహిణులకు 11 రకాల విత్తనాలతో ఉన్న కిట్లను అందజేశారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం సస్యపోషణ శాస్త్రవేత్త డాక్టర్ బి.కిరణ్ కుమార్, డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సిబ్బంది ఎస్.పి.నారాయణరావు, ఎం.గణేష్ పాల్గొన్నారు.

శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్త సునీత

ఆలయాల్లో చోరీలు

వజ్రపుకొత్తూరు: మండలంలోని సైనూరు పంచాయతీ పొల్లాడ గ్రామంలో తురక పోలమ్మ, కొత్తమ్మతల్లి ఆలయాల్లో మంగళవారం రాత్రి దొంగలు పడ్డారు. రెండున్నర తులాలు బంగారం, 14 తులాలు వెండి ఆభరణాలను అపహరించుకుపోయారు. సర్పంచ్ అట్టాడ గోపి బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ వై.మధుసూదన్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొన్నారు. క్లూస్ టీమ్ చేరుకొని సిసి కెమేరాలను పరిశీలించింది. సిసి కెమెరా డిసిని దుండగులు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. అమ్మవారి ఆలయానికి ఉన్న గ్రిల్స్ తొలగించి లోపలకి ప్రవేశించినట్లు ఆనవాళ్లు ఉన్నాయి. ఆలయం గురించి బాగా తెలిసిన వ్యక్తులు ఈ దొంగతనానికి పాల్పడినట్లు పోలీసులు నిర్ధారించారు. అమ్మవారి తాళిబొట్లు సుమారు రెండున్నర తులాలు, వెండి శఠగోపం సుమారు 14 తులాలు వరకు ఉంటుందని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మధుసూదన్ తెలిపారు.

గెలుపోటములు సహజం

పలాస : క్రీడాకారులు గెలుపుపై దృష్టి పెట్టాలని, గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలని పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. పలాస క్రీడా మైదానంలో గతంలో ఎంపిక చేసిన ఖోఖో జట్టుకు 20 రోజుల పాటు ఇచ్చిన శిక్షణ ముగింపులో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి క్రీడాకారుడూ రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యేలా తమ ప్రతిభను ప్రదర్శించాలన్నారు. నిరంతరం సాధన చేయాలన్నారు. ఒంగోలు ఈదరా ప్రాంతంలో నవంబర్ 11, 12, 13 తేదీల్లో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. అనంతరం పలాసకు చెందిన పారిశ్రామికవేత్తలు మల్లా భద్రయ్య, మల్ల సంతోష్, బద్రి గోపాల్, పెంట ఉదయశంకర్, విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. వ్యాయామ ఉపాధ్యాయులు పి.తవితయ్య, రాష్ట్ర టెక్నికల్ బోర్డు అథ్లెటిక్స్ సంఘం అధ్యక్షులు కె.హరిబాబు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం సహాయ కార్యదర్శి పద్మలోచన, కోచ్ తిరుమలరావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఖోఖో క్రీడాకారులతో మున్సిపల్ చైర్మన్ గిరిబాబు

ఉత్తరాంధ్ర ద్రోహి కూన రవి

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఉత్తరాంధ్ర అభివృద్ధిని విశాఖ పరిపాలన రాజధానిని అడ్డుకుంటున్న టిడిపి జిల్లా పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడు కూన రవికుమార్ ఉత్తరాంధ్ర ద్రోహి అని, రాబోయే రోజుల్లో చరిత్రహీనుడిగా మిగిలిపోతాడని నియోజకవర్గ వైసిపి నాయకులు చింతాడ రవికుమార్ అన్నారు. బొడ్డేపల్లిపేటలోని జగనన్న ప్రజాసేవ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. రవికుమార్ టిడిపి పెత్తందారుల తాబేదారుగా వ్యవహరిస్తూ ఉత్తరాంధ్రకు ద్రోహం చేస్తున్నారని మండిపడ్డారు. సోమవారం మంగళగిరి టిడిపి కార్యాలయంలో ఆయన మాట్లాడిన మాటలు ఉత్తరాంధ్రపై చిత్తశుద్ధి లేదని తేటతెల్లమైనదని అన్నారు. ఇప్పటికే విశాఖలో గీతం యునివర్సిటీ, ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజి, అనిల్ నీరుకొండ (ఎఎన్ఐటిఎస్), నోవాటెల్ హోటల్, జయభేరి ఆటోమబైల్స్ వంటి ప్రముఖ సంస్థలు టిడిపి తాబేదార్ల చేతుల్లోనే ఉన్నాయన్న విషయం కనిపించలేదా? అని ప్రశ్నించారు. సమావేశంలో వైసిపి నాయకులు కెప్టెన్ రామారావు, కొప్పల ఈశ్వరరావు, రాఘవేంద్ర, గురుగుబెల్లి భాస్కరరావు, రామ్మోహన్, బొడ్డేపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవికుమార్

నేడు 'సోమంచి' 142వ జయంతి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని బలగలో ఉన్న ఉత్తరేశ్వరస్వామి ఆలయ వ్యవస్థాపకులు సోమంచి కోదండరామయ్య 142వ జయంతి వేడుకలను ఆయన కుటుంబ సభ్యులు పిఎన్ కాలనీలోని స్వగృహంలో ఘనంగా నిర్వహించనున్నారు. మద్రాసు ఉమ్మడి రాష్ట్రంలోని కాలంలో అప్పటి గంజాం జిల్లా శ్రీకాకుళం పట్టణంలోని కానుకుర్తి వారివీధిలో కోదండ రామయ్య, రామయ్య, వేంకట నరసమ్మ దంపతులకు జన్మించారు. తండ్రి వృత్తి రీత్యా పౌరోహిత్యం. తల్లి వెంకట నరసమ్మ కుటుంబ ఆలనాపాలనా చూసుకునేవారు. ఆయన బాల్యం శ్రీకాకుళంలో ప్రారంభమైనా విద్యాభ్యాసం మాత్రం శ్రీకాకుళం విజయనగరం, కాశీ నగరంలో సాగింది. తెలుగు, ఆంగ్లం, సంస్కృతం, హిందీ భాషల్లో మంచి ప్రావీణ్యం సంపాదించారు. ఆయన తండ్రి ప్రోత్సాహంతో కాశీనగరంలో కొంతకాలం వేద విద్యలను, ఆయుర్వేదాన్ని అభ్యసించాడు. జ్యోతిష్య శాస్త్రంలో ప్రావీణ్యత పొందాడు. విజయ నగరం జిల్లాలో పార్వతీపురానికి చెందిన యర్రగుంట్ల కుటుంబానికి చెందిన సూరమ్మను 1899లో వివాహం చేసుకున్నారు. ఆయనకు 1900లో వెంకట నారాయణ, 1902లో వాసుదేవరావు, లక్ష్మీనరసమ్మలు జన్మించారు. నగరంలోని బలగ ప్రాంతంలో ఉన్న ఉత్తరేశ్వర స్వామి దేవాలయాన్ని 1909లోనూ, 1934లోనూ కోదండరామాలయ పున:ప్రతిష్టించారు. తాగునీటి అవసరానికి సొంత నిధులతో నేలబావిని తవ్వించి దాహార్తిని తీర్చారు. అలాగే ఉచితంగా ఆయుర్వేద వైద్యం అందించేవారు. వ్యాపార వేత్తగా మారి సూరత్, కలకత్తా, బొంబాయి తదితర నగరల నుంచి వస్త్రాలు తెప్పించి విక్రయించేవారు. సోమంచి కోదండ రామయ్య అండ్ సన్స్ పేరుతో నగరంలోని పెట్రోమాక్స్ వీధిలో వ్యాపార సంస్థను నడిపారు. తన రెండో కుమారు వాసుదేవరావును శివానందలహరి (సంస్కృతం నుంచి తెలుగుకు అనువాదం) ప్రోత్సహించాడు. కందుకూరి వీరేశలింగం పంతులుకు సమకాలికులుగా ఉన్న సోమంచి సాహిత్య, ఆధ్యాత్మిక వేత్తలైన రాంభొట్ల లక్ష్మీనారాయణశాస్త్రి, వెంపరాల సూర్యనారాయణ వంటి వారితో సన్నిహితంగా మెలిగేవారు. సాహితీ వేత్తగా ఆయన కుమారుడు వాసుదేవరావు వారసత్వాన్ని కొనసాగించారు. ఆయన రాసిన శివానందల హరి ఇప్పటికీ ఆధ్యాత్మిక వేత్తలకు సుపరిచితం.

కోదండరామయ్య (ఫైల్)

సమావేశంలో మాట్లాడుతున్న గౌతు శిరీష

రామారావుది టిడిపి అని నిరూపిస్తే
రాజకీయాల నుంచి తప్పుకుంటా
టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష

ప్రజాశక్తి- పలాస

మందస మండలం హరిపురం గ్రామంలో ఇటీవల జరిగిన ఘటనకు సంబంధించిన తల్లి కూతుళ్లపై దౌర్జన్యానికి పాల్పడిన కొట్ర రామారావు టిడిపికి చెందిన వ్యక్తి అని నిరూపిస్తే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష ధ్వజమెత్తారు. రాష్ట్ర మంత్రి అప్పలరాజుకు చిత్తశుద్ధి ఉంటే నిరూపించాలని, అబద్ధాలను నిజాలు చేయాలనే ప్రయత్నంలో భాగంగా వైసిపి నాయకులు పోలీసులను వాడుకుంటున్నారని ఆరోపించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. హరిపురం గ్రామానికి చెందిన తల్లీకూతుళ్లపై ట్రాక్టర్‌తో కంకర వేసి హత్యాయత్నం చేసిన కొట్ర రామారావు టిడిపికి చెందిన వ్యక్తి అని మంత్రి ఆరోపించడం తగదని హితవుపలికారు. బాధితులు టిడిపి సభ్యులు కానప్పటికీ ఒక మాజీ ముఖ్యమంత్రి మానవతా దక్పథంతో స్పందిస్తే అప్పలరాజు ఎంపీ, కళా వెంకటరావు కొట్ర రామారావు అనుచరుడని ఫొటోలు మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడంపై మండిపడ్డారు. పోలీసులు ఎంత దిగజారిపోయారో అల్లుకోట సర్పంచ్ ప్రతినిధి దువ్వాడ రవికుమార్‌పై దాడి ఘటనే నిదర్శనమని ఆరోపించారు. అల్లుకోట ఘటనపై వాస్తవాలు, న్యాయం, అన్యాయాలు వెలుగులోకి తీసుకువచ్చేందుకు బహిరంగ విచారణ చేపట్టేందుకు నిజాయితీగల పోలీస్ అధికారులను నియమించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, టిడిపి జిల్లా కార్యదర్శి పీరుకట్ల విఠలరావు, రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, జిల్లా కార్యదర్శి గాలి కృష్ణారావు, టంకాల రవిశంకర్ గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

లీగల్ సర్వీసెస్ అథారిటీ చట్టం పేదలకు వరం
'ఐలు' రాష్ట్ర కమిటీ సభ్యులు మోహనరావు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మోహనరావు

ఉచిత, సమర్థవంతమైన న్యాయ సహాయం అందించేందుకు అధికార సంస్థలను ఏర్పాటు చేసి పేద, బలహీన తరగతులకు న్యాయ నిరాకరించకూడదని ఉండేందుకు చేయబడిన లీగల్ సర్వీసెస్ అథారిటీ చట్టం (1987) అని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) రాష్ట్ర కమిటీ సభ్యులు బొడ్డేపల్లి మోహనరావు అన్నారు. న్యాయ సేవా దినోత్సవం సందర్భంగా ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ చట్టం నవంబరు 9, 1995 నుంచి అమల్లోకి వచ్చిందన్నారు. అందుకే నవంబరు 9న న్యాయ సేవా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. న్యాయ సేవలు అందుబాటులో ఉండేందుకు న్యాయ సంస్థల్లో ఏర్పాటైన గదిని 'ఫ్రంట్ ఆఫీస్' అని అంటారని అన్నారు. ఈ గదిలోనే న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ గది సమర్థవంతంగా, నాణ్యతతో కూడి ఉండాలని, అంతేకాకుండా న్యాయ సహాయం కోరి వచ్చే వారికి అర్థవంతమైన న్యాయం అందించేలా ఉండాలని తెలిపారు. వచ్చే వారిని ఆహ్వానించడం, ఫోన్లకు సమాధానం చెప్పడం రికార్డును నిర్వహించడం, సమాచారాన్ని భద్రపరచడం, కోర్టు సమాచారాన్ని తాజాపరచడం తదితర పనులను ఈ కార్యాలయంలో నిర్వహించాలని అన్నారు. అలాంటి ఏర్పాట్లు జరిగితేనే అందరికీ న్యాయం అందేందుకు అవకాశం ఉంటుందని, దీంతో న్యాయ సేవా దినోత్సవం సార్థకమవుతుందని అన్నారు.

చట్టం అందరికీ సమానమే

ఆమదాలవలస : ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, న్యాయవాదులు

ప్రజాశక్తి- పలాస

చట్టం అందరికీ సమానమేనని పలాస జూనియర్ సివిల్ జడ్జ్ పి.రవిశంకర్ అన్నారు. పలాస కోర్టులో జాతీయ న్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం జాతీయ న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల లీగల్ సెల్ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కక్షలు, కార్పణ్యాలతో ఏమీ సాధించలేరని, రాజీయే ఉత్తమ మార్గమని అన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు పిఎల్ నారాయణ, జిఎంఎస్ అనిల్‌రాజు, తాండ్ర మురళీ, పిండి వెంకటరావు, బికెఆర్ పట్నాయక్, కె.దేవరాజు, వై.హేమకుమార్, సుధారాణి, దివ్య, ఎపిపి రమేష్, ఎల్.చంద్రశేఖర్, ఘని, ఎస్‌వి.రమణ, ప్రభాకర్, మన్మథరావు, శ్యామ్, చిట్టిబాబు, రవి, పాణిగ్రాహి, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మాట్లాడుతున్న నాగరాజుపాత్రో

ఇచ్ఛాపురం: స్థానిక ప్రభుత్వ ఉన్నత బాలికల పాఠశాల మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆదేశాల మేరకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. బార్ అసోసియేషన్ సభ్యులు నాగరాజు పాత్రో మాట్లాడుతూ బాలికలు చదువుకునే వయసులో బాల్య వివాహాలు చేసుకోకూడదన్నారు. మండల లీగల్ సర్వీసెస్ కమిటీ తరఫున ఉచిత న్యాయసహాయం అందుతుందని తెలిపారు. సదస్సులో ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం త్రినాథరావు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

టెక్కలి: సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన వారికి, ఎస్‌సి, ఎస్‌టిల వారికి, మహిళలకు, వార్షిక ఆదాయం రూ.3 లక్షలు మించని వారికి ఉచిత న్యాయ సేవల్ని పొందటానికి అర్హులని టెక్కలి సీనియర్ సివిల్ జడ్జి టి.హరిత అన్నారు. స్థానిక కోర్టు ఆవరణంలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఎస్‌హెచ్‌ఆర్ మల్ల తేజచక్రవర్తి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ధర్మారాజు, న్యాయవాదులు వైకుంఠరావు పాణిగ్రాహి, దవళ రాజేశ్వరరావు, తాడి ధర్మారావు పాల్గొన్నారు.

ఆమదాలవలస : జాతీయ న్యాయ సేవా దినోత్సవం సందర్భంగా బార్ కౌన్సిల్ ఆధ్వర్యాన ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో గడపగడపకు న్యాయ సేవ అనే అంశంపై విద్యార్థినీ విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. ముందుగా నగరవీధుల్లో విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. అప్పీలు లేని తీర్పు - లోకదాలత్ లో తీర్పు, అందరికీ న్యాయం - అందుబాటులో న్యాయం, సమన్యాయం - సత్వర న్యాయం అన్న పలు నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం బార్ అసోసియేషన్ అధ్యక్షులు కణితి విజయలక్ష్మి ఆధ్వర్యాన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశం బాగుండాలంటే న్యాయ వ్యవస్థ పటిష్టంగా ఉండాలని, అందరికీ న్యాయం జరగాలని అన్నారు. పలువురు న్యాయవాదులు సమాచార హక్కు చట్టం, బాల్య వివాహాలు, ఆస్తి తగాదాలు, లోకదాలత్ గురించి వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ బి.శ్యాంసుందర్, జాతీయ సేవా పథకం అధికారి జలుమూరు రవి, న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

లావేరు : లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ప్రజాశక్తి- పోలాకి

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. బుధవారం చీడివలస పంచాయతీలో జిల్లెడవలస గ్రామంలో 71వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ప్రజా సమస్యలు తెలుసుకొని వాటిని పరిశీలించి, సత్వరమే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర సిఇసి మెంబరు ధర్మాన పద్మప్రియ, ఎంపిపి ప్రతినిధి ముద్దాడ బైరాగినాయుడు, వైసిపి మండల కన్వీనర్ కణితి కృష్ణారావు, సర్పంచ్ ప్రతినిధి ముద్దాడ రాము, జడూరు సర్పంచ్ గొల్లంగి అసిరితాత, వైసిపి నాయకులు చింతాడ ఉమా, ఆర్.త్రినాథరావు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

లావేరు: ప్రజా సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం వందో రోజు కార్యక్రమంలో భాగంగా బెజ్జిపురంలో బుధవారం నిర్వహించారు ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ అందజేసిన సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితులు రొక్కం బాలకృష్ణ, జెడ్‌పిటిసి ఎం.సీతంనాయుడు, మండల కన్వీనర్ డి.రాజనాయుడు, తహాశీల్దార్ ఎస్.దిలీప్ చక్రవర్తి, ఎంపిడిఒ విశ్వేశ్వరరావు, ఎపిఎం మాఊరు మాధవీలత, ఎఒ మహేష్‌నాయుడు పాల్గొన్నారు.

సోంపేట: ప్రతి కుటుంబ సంతోషమే లక్ష్యమని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. మండల కేంద్రంలోని16, 17, 18 వార్డుల్లో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. అందులో భాగంగా ప్రతి గడపకూ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఆమెతోపాటు ఎంపిపి నిమ్మాన దాస్, కంచిలి ఎంపిపి పైల దేవదాస్‌రెడ్డి, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ మడ్డు రాజారావు, సోంపేట పిఎసిఎస్ అధ్యక్షులు రౌతు విశ్వనాథం, సర్పంచ్ నగిరి పద్మావతి, జింకిభద్ర సర్పంచ్ తామాడ పద్మావతి, ఎంపిటిసి పొడుగు కామేష్, కర్రి సత్యం, దుర్గాసి మోహన్‌రావు, బీనా ఢిల్లీరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి

మాట్లాడుతున్న తులసీ వరప్రసాదరావు

ప్రజాశక్తి- కొత్తూరు

ప్రతి రైతూ ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని పాతపట్నం నియోజకవర్గం నాయకులు లోతుగెడ్డ తులసీవరప్రసాద్ అన్నారు. స్థానిక భయ్యాల కళ్యాణ మండపంలో కొత్తూరు, హిరమండలం, ఎల్ఎన్‌పేట, సరుబుజ్జిలి మండలాలకు చెందిన రైతులతో బుధవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రసాయన ఎరువులతో పండిస్తున్న పంటలు వల్ల ప్రజలు అనారోగ్యం గురవుతున్నారని అన్నారు. రసాయన ఎరువులు వల్ల భూమి సారవంతం కోల్పోతుందన్నారు. అందుకు సేంద్రీయ ఎరువులతో కూడిన పంటల వల్ల ఆరోగ్యవంతమైన జీవితం గడపవచ్చునన్నారు. భవిష్యత్‌లో రైతులు సేంద్రీయ వ్యవసాయ ఉత్పత్తులపై దృష్టిసారించాలన్నారు. ప్రకృతి వ్యవసాయానికి, రసాయనిక వ్యవసాయానికి ఆదాయ వ్యయాల్లోనూ తేడా ఉందన్నారు. సేంద్రీయ వ్యవసాయనికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కుంచాల రత్నాలు, కోయిలాపు శ్రీశీనివాసరావు, సవర ఫాల్గుణరావు, పుచ్చ అప్పారావు, సర్పంచ్‌ల ప్రతినిధులు వై.సంతోష్‌కుమార్, సూదర్శనరావు, రైతు ప్రతినిధులు ఎల్.తాత, బాబు, ఖండాపు ప్రసాదరావు, కోయిలాపు సంజీవరావు, ఎ.నాగేశ్వరరావు, పి.వెంకటకృష్ణ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

నేడు స్పీకర్ పర్యటన

పొందూరు: పొందూరులో శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం గురువారం పర్యటించనున్నట్లు వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్ ఒకయ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు పొందూరులోని స్పీకర్ క్యాంపు కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించనున్నారని పేర్కొన్నారు. అనంతరం కింతలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాడు-నేడు పనులకు శంకుస్థాపన చేస్తారని అన్నారు. మండలంలోని వైసిపి నాయకులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, అభిమానులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ప్రస్తుతం వరి కోతలు వద్దు

బూర్జ : మండలంలోని రైతులు ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా వరి కోతలు పనులు చేపట్టవద్దని మండల వ్యవసాయ శాఖ అధికారి రాజేశ్వరరావు ఒక ప్రకటనలో సూచించారు. వాతావరణ శాఖ సూచనల మేరకు రానున్న మూడు రోజులు విస్తారంగా వరుసలు కురిసే అవకాశం ఉందన్నారు. అందుకు రైతులు ఎటువంటి వ్యవసాయ పనులు చేపట్టకూడదని అన్నారు. ముఖ్యంగా ఇంతవరకు వరి కోతలు ప్రారంభించిన రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే కళ్లల్లో ధాన్యం బస్తాలు సురక్షితంగా ఉండేలా చర్యలు చేపట్టాలని తెలిపారు.

21న హరిశ్చంద్రపురంలో చాగంటి ప్రవచనాలు

కోటబొమ్మాళి: మండలం చిన్న హరిశ్చంద్రపురం శ్రీ పంచరామక్షేత్రంలో ఈ నెల 21వ తేదీ కార్తీక నాలుగోవ సోమవారం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో చాంగటి కోటేశ్వరరావుతో ప్రవచనాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు ఉప్పాడ కనకరాజు బుధవారం తెలిపారు. వేద పండితులు బంకుపల్లి సుబ్రమణ్యశర్మ అధ్యక్షతన ఆలయ ప్రాంగణంలో సాయంత్రం 6గంటలనుంచి లక్ష దీపారాధన నిర్వహిస్తున్నట్లు చెప్పారు. లక్ష ఒక్క శివ లింగాల ప్రతిష్ట చేయనున్నట్లు తెలిపారు. యాత్రికులు పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు.

ప్రవేశాలకు గడువు పెంపు

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో బిఎ, బి.కాం, బిఎస్‌సి ప్రథమ సంవత్సరంలో చేరాలనుకునే విద్యార్థులకు ప్రవేశ గడువు పెంచినట్లు ప్రిన్సిపాల్ తెంబూరు గోవిందమ్మ తెలిపారు. బుధవారం ఆమె ఒక ప్రకటనను విడుదల చేశారు. ఈనెల 11 నుంచి 13వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

మానసిక వికలాంగుల్లో ఆత్మస్థైర్యం నింపాలి

టెక్కలి: భవిత కేంద్రాల్లోని మానసిక వికలాంగుల్లో ఆత్మస్థైర్యం నింపాలని ఉపాధ్యాయుడు అట్టాడ మన్మథరావు అన్నారు. బుధవారం గూడెం గ్రామానికి చెందిన శ్రీధర్ సుశీలా రాణిల కుమార్తె పోకల శరణ్య పుట్టిన రోజు సందర్భంగా భవత కేంద్రంలో జన్మదిన వేడుకలు నిర్వహించారు. అనంతరం వారికి భోజన సదుపాయం కల్పించారు. కార్యక్రమంలో మండల రీసోర్స్ కేంద్రం సిబ్బంది రవి, సంతోష్, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

జలుమూరు: మండలంలోని కరవంజ గ్రామంలోని ఆదర్శ పాఠశాలలో చదువుతున్న 92 మంది విద్యార్థులకు బుధవారం జలుమూరు పిహెచ్‌సి వైద్యాధికారి తాడేల శ్రీకాంత్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శీతాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు చిన్నరాజులు, హెల్త్ అసిస్టెంట్ చిన్నారావు, ఎఎన్ఎం, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లీ నడకయాతన

గ్రామస్తులతో మాట్లాడుతున్న దాసరి రాజు

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని బి.గొనపపుట్టుగ పంచాయతీలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు నడకయాతన అనుభవిస్తున్నారని, గర్భిణులు, రోగులను ఈ మార్గంలో తీసుకెళ్లాలంటే వాహనదారుల హడలిపోతున్నారని జనసేన ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త దాసరి రాజు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం బిజి.పుట్టుగ పంచాయతీలోని తుంగానపుట్టుగ, గుమ్మడిపుట్టుగ, తడకపుట్టుగ, లొట్టిపుట్టుగ, పద్రిపుట్టుగ, బంజుపుట్టుగ, చెవిటిపుట్టుగ గ్రామాల్లోని రహదారులను జనసైనికులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు ఆయనతో మాట్లాడారు. కంకరరోడ్ల పరిస్థితి మరీ అధ్వానంగా ఉందని, రోడ్డు మొత్తం గుంతలు పడి కొంత భాగం, ఇసుక మేటలు వేసి చెడిపోయిందని తెలిపారు. దాసరి రాజు మాట్లాడుతూ ముఖ్యమైన పదవుల్లో కవిటి మండల నాయకులే ఉన్నారని, అయినా మండలంలో రహదారుల పరిస్థితి అధ్వానంగా ఉండటం సిగ్గుచేటని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తక్షణమే ఆయా గ్రామాల రహదారుల సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై గ్రామస్తుల సంతకాలతో కూడిన వినతిపత్రం మండల పరిషత్ ఎఒ జయంత్ ప్రసాద్‌కు అందజేశారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర మత్స్యకార వికాస విభాగ కార్యదర్శి నాగుల హరి బెహరా, అంగ సురేష్, రోకళ్ల భాస్కర్, బడగల రామకృష్ణ, లోల్ల సాగర్, నర్తు కృష్ణ, దూగాన దివాకర్, హేమాచలపతి, దేవా, రాజశేఖర్, శ్యామ్, ధనుంజయం, అమిత్ తదితరులు పాల్గొన్నారు.

మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలి

మెళియాపుట్టి: మండలంలోని రామచంద్రపురం రైతు భరోసా కేంద్రంలో డాక్టర్ వైఎస్ఆర్ పొలంబడిని వ్యవసాయశాఖ ఎడి లింగాల మధుబాబు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేలైన యాజమాన్య పద్ధతిలు పాటించాలని రైతులకు సూచించారు. పురుగు మందుల పిచికారి సరైన సమయంలో, సరైన మోతాదులో మాత్రమే చేయాలని, వీలైనంతవరకు పురుగుమందుల పిచికారిని తగ్గించాలని సూచించారు. అధికంగా పురుగు మందులు పిచికారి చేయడం వల్ల మిత్ర పురుగులు చనిపోతాయని తెలిపారు. ఇది పంటకు మరింత నష్టం చేకూర్చుతుందని చెప్పారు. సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించడం వల్ల రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. రైతులు పెట్టుబడి ఖర్చులు తగ్గించి అధిక దిగుబడి సాధించాలంటే వ్యవసాయ అధికారులు సూచనలు, సలహాలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి దానకర్ణుడు, సర్పంచ్ వసంతకుమారి గ్రామ వ్యవసాయ సహాయకులు నరేంద్రకుమార్, రైతులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

పోలాకి : ప్రజలు నగదు లావాదేవీల విషయంలో సైబర్ నేరాలకు గురి కాకుండా అప్రమత్తంగా ఉండాలని పోలాకి ఎపిజివిబి మేనేజర్ ఎం.కోటేశ్వరరావు సూచించారు. బుధవారం గొల్లలవలస పంచాయతీలో జాతీయ సమగ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం డిజిటల్ లావాదేవీలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ఎఈపిఎస్ లావాదేవీలు చేసేటప్పుడు ఒటిపి విధానం అనుసరించాల్సి వస్తుందని చెప్పారు. ఎటిపరిస్థితుల్లోనూ ఒటిపిని ఎదుటివారితో పంచుకోకూడదని తెలిపారు. లోన్ యాప్‌ల ద్వారా రుణాలు తీసుకోవద్దని అన్నారు. వెలుగు ఎపిఎం జి.రాజారావు, సిసి గోవిందరావు, విఒఎ పాలకుండా పార్వతి, రాజులమ్మ, శంకరరావు పాల్గొన్నారు.

పోస్టర్లను అందజేస్తున్న సభ్యులు

ఇంటింటికీ 'ఎంజిఆర్'

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని కలిగాం, బమ్మిడి, వెంకటాపురం, గురండి, పాతపాడు, ఆర్.కె.పురం, మదనాపురం, వెంకటాపురం కాలనీల్లో ఇంటింటికీ జిఎంఆర్ కార్యాక్రమాన్ని యువసేన సభ్యులు బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సామాజిక వేత్త, నియోజకవర్గ టిడిపి నాయకులు మామిడి గోవిందరావు 12 ఏళ్లుగా పలు సేవా కార్యక్రమాలను, అలాగే టిడిపి సిద్ధాంతాలను తెలియజేశారు. కార్యక్రమంలో అరుబోలు దశరథరావు, పిండి రామారావు, బిల్లింగి భాస్కరరావు, బుడ్డ చక్రధర్, వంబరివల్లి ప్రతాప్, కె.సంతోష్, అగతముడి రాజేశ్వరి, బుద్దల రామకృష్ణ, మఠము రంగారావు, మడపాన రామరాజు, ఎర్లంకి తిరుపతిరావు, బిల్లింగ్ కృష్ణారావు పాల్గొన్నారు.

శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర యువజన విభాగానికి ఇద్దరు ఎంపిక

ప్రజాశక్తి- రణస్థలం

కీర్తి, యుగంధర్

ఐఎస్ఒ గుర్తింపు పొందిన అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ శ్రీశ్రీ కళా వేదిక అంధ్రప్రదేశ్ యువజన విభాగం కార్యవర్గంలో మండలానికి చెందిన ఇద్దరిని ఎంపిక చేసినట్లు జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ రఫీ (ఈవేమన) ఒక ప్రకటనలో తెలిపారు. మండలానికి చెందిన బూడిద కీర్తి, (రాష్ట్ర మహిళా కార్యదర్శి), చల్ల పేటకు చెందిన యం.యుగంధర్ (రాష్ట్ర సహాయ కార్యదర్శి)గా శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తి మండ ప్రతాప్, కన్వీనర్ కొల్లి రమావతి సారథ్యంలో ఎంపికైనట్లు పేర్కొన్నారు. యుగంధర్ చిన్ననాటి నుంచి చిత్రలేఖనంలో ఎన్నో బహుమతులు గెలుపొందారన్నారు. అలాగే సాహిత్య సంపుటలకు ముఖచిత్రాలూ వేసే ఘనతతో పాటుగా చంద్రబాబు నాయుడు, పవన్‌కళ్యాణ్, రోజా, చిన్నజీయరుస్వామి చిత్రాలు వేసి వారి ఆశీస్సులూ పొందారన్నారు. అలాగే ఆదర్శ పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి వరకు, ఐఐటికు ఎంపికైన బూడిద కీర్తి బాల్యం నుంచే ఎన్నో కథలు రాస్తూ... నగదు బహుమతులు గెలుచుకుందన్నారు. వీరిని ఎంపిక చేయడం ఆనందంగా ఉందన్నారు. వావిలాపల్లి రాజారావు, సేవాసంస్థ రాజు, సాహితీ ప్రియులు హర్షం వ్యక్తం చేశారు.

దోమపోటుపై ఆందోళన వద్దు



పోలాకి : వరి పంటను పరిశీలిస్తున్న రవీంద్రభారతి

ప్రజాశక్తి- పోలాకి

వరిని ఆశించిన తెల్ల తెగులు, దోమ పోటుపై రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదని, నివారణ మందులు వాడితే సరిపోతుందని నరసన్నపేట వ్యవసాయ ఎడి రవీంద్ర భారతి సూచించారు. బుధవారం బెలమర పాలవలస, పోలాకి రైతు భరోసా కేంద్రాలు పరిధిలోని వ్యవసాయ క్షేత్రాలను కెవికె శాస్త్రవేత్తలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. ఖరీఫ్‌లో ఇండిగో 333 రకం విత్తనాలు వాడిన చోట ఈ తెగులు, దోమ పోటు ఎక్కువగా ఉందని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఆ కంపినీకి నోటీసులు ఇస్తామని తెలిపారు. దోమ పోటు నివారణకు హెస్పెట్ 400 గ్రాములు, లేదా మోనోక్రాట్ పాస్ 500 ఎంఎల్, లేదా థై మిత్రాక్షన్ 100 గ్రాములు ఎకరానికి చొప్పున నీటిలో కలిపి పిచికారి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎఒ చిరంజీవి, వ్యవసాయ శాస్త్రవేత్తలు శ్రీలత, నీలవేణి, మధుకుమార్, రైతులు పాల్గొన్నారు.

శాస్త్రవేత్తలు పరిశీలన

జి.సిగడాం: మండలంలో గత నెలలో ఆకాల వర్షాల కారణంగా వరి పంటకు పట్టిన సుడిదోమకు గురౌంది. మండలంలోని ఆనందపురం, వాండ్రంగి గ్రామాల్లోని సుడిదోమకు గురైన వరి పంట పొలాలను కెవికె శాస్త్రవేత్తలు కె.త్రినాథస్వామి, డిఎడి రైతు శిక్షణా కేంద్రం శాస్త్రవేత్త వెంకటరావు బుధవారం పరిశీలించారు. దోమల నివారణకు క్రమ పద్ధతిలో పురుగు మందులను పిచికారీ చేయాలన్నారు. దోమ సోకిన వెంటనే లీటరు నీటికి 1.5 గ్రాముల ఎసిఫేటే పొడి మందును పిచికారీ చేయాలన్నారు. తరువాత బుప్రోఫెజిన్, థైయో మితాక్సీమ్, పైమిట్రేజోనే మందులను పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు ఎ.లక్ష్మీనారాయణ, ఎం. హేమంత్‌కుమార్ రైతులు పాల్గొన్నారు.

సమిష్టి కృషితో సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

సమిష్టి కృషితో రైతుల సమస్యలు పరిష్కారమవుతాయని రైతు సంఘాల కన్వీనర్ జన్నెలా ప్రసాదరావు అన్నారు. పట్టణంలో రైతులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 16న జక్కర గ్రామంలో నియోజకవర్గ స్థాయి రైతుల సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో రైతుల సమస్యలపై చర్చించి, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని తీర్మానించారు. మొట్టమొదటి సమావేశానికి అందరూ హాజరుకావాలని పిలుపునిచ్చారు. బెల్లుపడలో రైతు సంఘం ఆధ్వర్యాన జరిగిన సమావేశానికి ఆసి చిరంజీవులు రెడ్డి, దుర్గాశి పాపారావు, దక్కత విశ్వనాథ్‌రెడ్డి, పరపతి కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వం అందజేస్తున్న సభ్యులు

రెడ్‌క్రాస్ సేవలు అమోఘం

ప్రజాశక్తి- పొందూరు

ఇండియన్ రెడ్‌క్రాస్ సేవలు అమోఘమని పొందూరు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామ్‌మనోహర్ అన్నారు. పొందూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రుదిర ప్రాజెక్టు ఆధ్వర్యాన బ్లడ్‌గ్రూప్ నిర్ధారణ పరీక్షలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 200 మంది విద్యార్థులకు రక్త పరీక్షలను నిర్వహించారు. పలువురు విద్యార్థులు జూనియర్ రెడ్‌క్రాస్‌లో సభ్యత్వం స్వీకరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కాళ్లకూరి శాంతారాం, కె.రాజేష్, సత్యనారాయణ, పవన్, గణేష్, శ్రీధర్ పాల్గొన్నారు.

అప్రమత్తతే ఆయుధం

కవిటి: ప్రకతి విపత్తుల సమయంలో అప్రమత్తత, సమయస్ఫూర్తి ఆయుధాలని యుఎన్‌డిపి ప్రతినిధులు అంజన మాధవన్, క్రథి గర్గ్ అన్నారు. జపాన్ ప్రభుత్వ సహకారంతో యుఎన్‌డిపి జిల్లాలోని తీరప్రాంత గ్రామాల్లో సునామీ విపత్తు నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. అందులో భాగంగా మండలంలోని ఇద్దివానిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలు వివరించారు. వీటిపై గురువారం మాక్ డ్రిల్ నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మురళీకష్ణ, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పుష్పగుచ్ఛం అందజేస్తున్న గ్రామస్తులు

మామిడి శ్రీకాంత్ పరామర్శ

మెళియాపుట్టి: మండలంలోని పెద్ద పద్మపురం గ్రామానికి చెందిన ఉర్లాన లక్ష్మీనారాయణ అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ ఆయనను బుధవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన వనభోజనాల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఎంపిటిసి ఉర్లాన అంశమ్మ రుషి, గ్రామస్తులు శ్రీకాంత్‌ను సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి ఎస్.ఆదినాయుడు, సర్పంచ్‌లు జనపరెడ్డి కన్నబాబు, పెద్దింటి చంద్రరావు, ఎస్ గౌరీష్, తెంబూరు ప్రసాద్‌రావు, మాజీ సర్పంచులు ఎస్.రాజకుమార్, శ్రీరామ్, శ్రీనివాసరావు, ఎస్.జగదీష్, నీలకంఠం, రుక్మాంగధరరావు పాల్గొన్నారు.

క్షౌరవృత్తికి పేటెంట్ కల్పించాలి

కోటబొమ్మాళి: రిలయన్స్ సంస్థ ఆరు వేల సెలూన్లు పెట్టి క్షౌర వృత్తిదారుల పొట్ట కొట్టడానికి ముందుకు రావడం దుర్మార్గమని నాయీబ్రాహ్మణుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నౌగాపు నాగరాజు అన్నారు. ఆయన బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. రిలయన్స్ సెలూన్ షాపుల ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, సెలూన్ షాపుల ఏర్పాటుకు అనుమతులను వెంటనే నిలిపివేయాలన్నారు. అనాదిగా నాయీబ్రాహ్మణ క్షౌరవత్తిపై వృత్తిదారులకు ప్రభుత్వం వెంటనే పేటెంట్ హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో 99శాతం మంది నాయీబ్రహ్మణలు ఈ వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్నారని ఈ విషయం ప్రజాప్రతినిధుల దృష్టిలో పెట్టుకొని రిలయన్స్ సంస్థకు అనుమతులు ఇవ్వకుండా చూడాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పలువురు నాయిబ్రాహ్మణలు ఉన్నారు.

డి-పట్టా భూమి పరిశీలన

ఆమదాలవలస : మండలంలోని బెలమాం పంచాయతీ లొద్దలపేటలో సర్వే నంబరు 108లో ఉన్న 50 సెంట్ల డీపట్టా భూమిని ఆర్‌డిఒ బొడ్డేపల్లి శాంతి బుధవారం పరిశీలించారు. డీ పట్టా భూమిలో నిర్మిస్తున్న గృహాన్ని పరిశీలించాలని జెసి ఎం.నీవన్ ఆదేశించారని, దీంతో గ్రామంలోకి వెళ్లి చెరువును, నిర్మిస్తున్న ఇంటిని పరిశీలించి విచారణ చేపట్టారు. ఈ నివేదికను జెసికి అందజేస్తానని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సర్వేయర్ల ఎడి ప్రభాకరరావు, తహాశీల్దార్ ఎం.వి.పద్మావతి, మండల సర్వేయర్ బొడ్డేపల్లి గోపి, విఆర్ఒ రామారావు పాల్గొన్నారు.

అమరుల త్యాగాలు మరువలేనివి

పలాస: భూమి, భుక్తి, విముక్తి కోసం పోరాడి ప్రాణాలు ధారబోసిన అమరుల త్యాగాలు మరువలేనివని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు అన్నారు. మండలంలోని బొడ్డపాడు గ్రామంలో బుధవారం అమరవీరుల స్మారక భవనం వద్ద చంద్ర పుల్లారెడ్డి వర్థంతిని పురస్కరించుకొని అమరవీరుల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్ర పుల్లారెడ్డి గోదావరి ప్రతిఘటన పోరాట అమరులను, శ్రీకాకుళం నక్సల్ బరి అమరులను స్మరించుకొని ఘనంగా విప్లవ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోదీ, అమిత్‌షా ప్రభుత్వం హిందూ మతోన్మాద పాషణాన్ని అమలు చేస్తోందని విమర్శించారు. దానికి వ్యతిరేకంగా ప్రజాస్వామ్యవాదులు, మేధావులు పోరాడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు గోరకల బాలకృష్ణ, ఐఎఫ్‌టియు జిల్లా కన్వీనర్ జుత్తు వీరాస్వామి, రాపాక మాధవరావు, మద్దిల వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు